క్లుప్తంగా

కొనసాగుతున్న ఆధార్ శిబిరాలు



చాకరాజువేములలో ఆధార్ నమోదు చేస్తున్న డీఏ నాగేశ్వరరావు

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఆపార్, జిల్లా మార్పు కోసం స్థానికుల నుంచి విశేష స్పందన వస్తుంది. గురువారం గ్రామంలో 50 మంది ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేయించుకున్నారు. క్రిష్టిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రంలో సాంకేతిక కారణాలతో కంప్యూటర్లు పనిచేయక ఆధార్ సవరణలు జరగలేదు. రెండు గ్రామాల్లో రెండో రోజూ కూడా కొనసాగిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన పెంచుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): వృత్తి విద్యపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అన్నారు. గురువారం వొకేషనల్ శిక్షణలో భాగంగా 9, 10వ తరగతుల విద్యార్థినులకు కంప్యూటర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నందమూరినగర్‌లోని సచివాలయ కార్యాలయంలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది వెంకట సుధాకర్, నాగేంద్ర, జయరాంనాయక్, రిజ్వానా తదితరులు అవగాహన కల్పించారు.

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి

చాగలమర్రి: రెసిడెన్షియల్ ఎస్ఎల్‌డీపీ శిక్షణలో ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోవడంపై ఎస్టీయూ నాయకులు తీవ్రంగా ఖండించారు. గువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో అనంతపురం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతిచెందిన వార్త మరవక ముందే మళ్లీ ఈ రోజు గజపతినగరంలో శ్రీకాకుళం జిల్లా, భామిని మండలం, నేరడి గ్రామ యూపీ పాఠశాలలో పనిచేస్తున్న శ్రీను మాస్టారు మృతి చెందడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి శిక్షణ కార్యక్రమాన్ని తక్షణమే నిలిపివేసి నాన్ రెసిడెన్షియల్ లేదా ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించాలని కోరారు. శ్రీను మస్టారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఉయ్యాలవాడ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన ట్రాక్టర్‌ను గురువారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ శివారులో పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. జమ్మలమడుగులోని పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తూ ఎలాంటి రాయల్టీ లేకుండా విక్రయిస్తూ వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు లేక పోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ నవీన్‌పై కేసు నమోదు చేశామని చెప్పారు.

రోడ్డు వెడల్పు చేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్, ఆర్‌డీఓ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బైటి పేట రోడ్డును వెడల్పు చేయాలని కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో గురువారం కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఆర్‌డీఓ విశ్వనాథ్ కలిసి రోడ్డును పరిశీలించారు. వారు మాట్లాడుతూ బైటిపేటలో వైకుంఠ రథం వెళ్లడానికి ఇరుకుగా ఉందని, కాలనీలో ఉన్న రోడ్డును వెంటనే వెడల్పు చేయాలని లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి రోడ్డు వెడల్పురకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాల అకాడమీ పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్, ఉదయానంద ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి గైనకాలజిస్ట్ గీతావాణి, డాక్టర్ సుస్మిత పాల్గొని క్యాన్సర్ వ్యాధి గురించి వివరించారు. కరస్పాండెంట్ రవీంద్రనాథ్, మాధవీలత, రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుల అరెస్ట్

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో రస్తా, మెట్ల నిర్మాణ విషయంలో 23న జరిగిన ఘర్షణలో డేరంగుల లక్ష్మీనరసింహ హత్యకు గురైన కేసులో నిందితులైన అదే గ్రామానికి చెందిన వడ్డె లక్ష్మీనరసింహ అతని భార్య లక్ష్మీదేవిని గురువారం ముత్యాలపాడు బస్టాండు వద్ద అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు.

ఆశల వరి

ఖరీఫ్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావం, ఆగస్టు నుంచి భారీ వర్షాలతో పంటల దిగుబడులు పడిపోయి రైతులు నష్టపోయారు. ఇక దిగుబడులకు గిట్టుబాటు ధర లేకపోవడం వారిని మరింత కుంగదీసింది. అయినా ఆశ చావక రెండో పంటగా వరి పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నారు మడులు సిద్ధం చేసుకోగా.. కోతలు పూర్తయిన పొలాల్లో వెంటనే బురద సేద్యం చేయిస్తున్నారు. ఈ పంటైనా ఆదుకోకపోతుందా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- కలిసిరాని ఖరీఫ్
- రెండో పంటగా మళ్లీ సాగు చేస్తున్న రైతులు
- సిద్ధమవుతున్న నారు మడులు

రుద్రవరం: మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్ కలిసి రాలేదు. మొక్కజొన్న, మినుము, పత్తి వంటి పంటలు కాస్త గట్టెక్కించినా.. వరి, మిర్చి పంటలు రైతులను బాగా దెబ్బతీశాయి. వాతావరణం అనుకూలించకపోవడం, తుఫాను పంటలను ముంచెత్తడంతో దిగుబడులు భారీగా తగ్గాయి. వాటికి తోడు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూశారు. చేసేదిలేక రైతులు మిర్చి పంటను దున్నేశారు. ప్రస్తుతం వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఎకరాకు 30 బస్తాలకు మించి దిగుబడి రాకపోవడం, బస్తా ధర రూ.1400లోపే ఉండటంతో పెట్టుబడులు రావడం గగనమైంది. రెండో పంటలోనైనా లాభాలు గడించాలనే ఆశతో రైతులు రెండో పంట సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఓ వైపు వరి కోతలు సాగిస్తూనే మరో వైపు ట్రాక్టర్లతో బురద సేద్యాలు చేయించి నారుమడులను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రం రుద్రవరంతో పాటు నర్సాపురం,చిత్రేనిపల్లె,ముకుందాపురం, డి.కొట్టాల, చిన్నకబలూరు, పెద్ద కంబలూరు, వెలగలపల్లె, తండా, కోటకొండ,ఎల్లావత్తుల తదితర గ్రామాల్లో నారుమడులు సిద్ధ చేశారు. కయ్యల్లో నారు ఏపుగా పెరుగుతోంది. మరో వైపు నారు నాటేందుకు పొలాల్లో ట్రాక్టర్లతో బురద సేద్యాలు చేయిస్తున్నారు. ఖరీఫ్‌లో దాదాపు 5వేల హెక్టార్ల వరకు వరిపంట సాగు చేయగా రబీలో 3వేల హెక్టార్లు సాగు కావచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే మిర్చి పంట తొలగించిన పొలాల్లో మాత్రం రెండో పంటగా మొక్కజొన్న వేశారు.



రుద్రవరం సమీపంలో ట్రాక్టర్‌తో బురద సేద్యం చేస్తున్న రైతన్న





ముకుందాపురం వద్ద నారు కోసం గింజలు చల్లుతున్న దృశ్యం, చిత్రేనిపల్లె వద్ద కయ్యలో పెరుగుతున్న వరి నారు

సాగునీటి సంఘాల ఓటరు జాబితా పూర్తి

గోస్పాడు: మండలంలో ఆరు సాగునీటి సంఘాలు ఉన్నట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన రైతుల ఓటరు జాబితాను పూర్తిచేసినట్లు తెలిపారు. అందులో భాగంగా తేళ్లపురి, గోస్పాడు, జిల్లెల్ల, యాళ్లూరు గ్రామాల్లో ఒక్కొక్క నీటి సంఘం ఉండగా దీబగుంట్లలో రెండు నీటి సంఘాలు ఉన్నట్లు చెప్పారు. ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో 12 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉంటాయన్నారు. వాటి పరిధిలో జూలేపల్లె 629, ఎం.చింతకుంట్ల 1150, తేళ్లపురి 610, ఎస్.కూ లూరు 89, ఎం.క్రిష్టాపురం 275, సాంబవరం 797, దీబగుంట్ల 2156, ఎస్.నాగులవరం 372, కానాలపల్లె 568, గోస్పాడు 496, పసురపాడు 647, ఒంటివెలగల 677, రాయపాడు 211, యాళ్లూరు 2377, జి ల్లెల్ల 2032 మంది రైతు ఓటర్లు ఉన్నట్లు వివరించారు.

చిన్నారులకు గొడుగుల పంపిణీ

నంద్యాల(అర్బన్): యానిమల్ ఈవెంట్స్ సెలబ్రేషన్స్‌లో భాగంగా వరల్డ్ విజన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మధుమణి డాక్టర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో 137 మంది గ్రామీణ చిన్నారులకు గొడుగుల పంపిణీ చేశారు. టూటౌన్ సీఐ ఇస్మాయిల్, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు, రవినాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు గొడుగులను పంపిణీ చేశారు.

జ్యోతిరావు ఫూలేను ఆదర్శంగా తీసుకోవాలి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

బొమ్మలసత్రం:అంటరానితనం, కులవివక్షత నిర్మూలన కోసం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావుపూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. గురువారం ఆయన 134 వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులతో కలిసి ఎమ్మెల్సీ , మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా పద్మావతినగర్ ఆర్చ్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, కౌన్సిలర్లు, పురేందర్, కలాంబాషా, ఆరిఫ్‌నాయక్, చంద్రశేఖర్, సలాముల్లా, కాల్వనాగరాజు, అనిల్ అమృతరాజ్, మునయ్య, టీవీరమణ, జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): జ్యోతిరావు పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న అన్నారు. పద్మావతి నగర్ కూడలి వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఊకొట్టు వాసు, నూర్ బాషా పాల్గొన్నారు. అలాగే.. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి ఉద్యోగులు నివాళులర్పించారు. శ్రీహరి, శ్రీనివాసులు, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నంద్యాల అభివృద్ధి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల(అర్బన్): మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నంద్యాల పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా అన్నారు. వార్డు పర్యటనకు వస్తున్న అధికారులు ప్రజా ప్రతినిధులకు తెలిపితే సమస్యల పరిష్కరించుకోవచ్చని సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిల్ దృష్టికి వచ్చిన మూడు అంశాలు మినహా అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాల్గవ వార్డు కౌన్సిలర్ తబ్రేజ్ సభ దృష్టికి తెచ్చారు. 34వ వార్డు కౌన్సిలర్ మాబువలి అజెండాల్లో లేని వాటిని ఎలా అంగీకరిస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేయగా మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకు కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులను సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేలా తీర్మానం చేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా గతంలో 200 పనులకు కౌన్సిల్ తీర్మానం చేసిన తర్వాత నిలిచిపోయాయని, వాటిని తిరిగి ఎప్పుడు మొదలు పెడతారంటూ 32వ వార్డు కౌన్సిలర్ మనోరంజని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. నిధుల లభ్యతను బట్టి ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తామని కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. తమ వార్డులో 11 పనులు పెండింగ్‌లో ఉన్నాయని, కౌన్సిల్‌కు రావాలంటే సిగ్గుగా ఉందంటూ కౌన్సిలర్ కృష్ణమోహన్ కౌన్సిల్ ముందు వాపోయారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కుతూ బిల్డింగ్‌ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని 34వ వార్డు కౌన్సిలర్ మహబూబ్‌వలి ఆరోపించారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ల మీద వస్తున్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ మాబున్నిసా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఇగోలకు పోతూ పట్టణాభివృద్ధిని విస్మరిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. అమృత్ పథకం కింద నీటి కుళాయిలను ఉచితంగా ఇస్తామంటూ గత టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ప్రస్తుతం నీటి కుళాయిలకు పన్నులు విధించడం ఏమిటంటూ 32వ వార్డు కౌన్సిలర్ మనోరంజని ప్రశ్నించారు. వాయిదాల పద్ధతిలో కాకుండా రూ.వేల రూపాయలు చెల్లించాలంటూ తాగునీటి వినియోగదారులపై ఒత్తిడి చేయడం దారుణంగా ఉందన్నారు. డంపయార్డు ద్వారా వస్తున్న పొగతో 1వ వార్డు, పీవీనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలంటూ 1వ వార్డు కౌన్సిలర్ నాగార్జున కౌన్సిల్ దృష్టికి తెచ్చారు.

ఆంధ్ర కళాదర్శిని బుక్‌లో కోటేష్ చిత్రాలు

నంద్యాల(అర్బన్): విజయవాడకు చెందిన ప్రముఖ చిత్రకారుడు ఎడిటర్ కళాసాగర్ ఆధ్వర్యంలోని ఆర్ట్ ఆఫ్ ఏపీ ఆంధ్ర కళాదర్శినిలో నంద్యాల చిత్రకారుడు కోటేష్ చిత్రాలకు చోటు దక్కింది. తెలుగువారి ప్రతిభను లోకానికి చాటేలా కోటేష్ గీచిన మాతృప్రేమ మత్స్యకన్య, ఎన్టీఆర్ నట విశ్వరూపం చిత్రాలను ఈనెల 10న విజయవాడలో ప్రచురించినట్లు కోటేష్ గురువారం తెలిపారు. ఆంధ్ర కళాదర్శిని బుక్‌లో తన చిత్రాలను ఎన్నుకున్న కళాసాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 10న హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్ కళాశాలలో పుస్తక పరిచయ సభలో తన చిత్రాలు ప్రదర్శనకు రానున్నాయని చెప్పారు.





కళాదర్శినిలో చోటు దక్కించుకున్న చిత్రాలు

విద్యార్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గోస్పాడు: విద్యార్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఆర్బీఎస్‌కే ఇన్‌చార్జ్ నోడల్ అధికారి కాంతారావునాయక్ తెలిపారు. గురువారం జిల్లాలోని దీబగుంట్ల హైస్కూల్, గోస్పాడు, ఉయ్యాలవాడలోని మోడల్ స్కూళ్లలో నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలల వద్దే పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. గోస్పాడులో 496, దీబగుంట్లలో 518, ఉయ్యాలవాడలో 416 విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. వైద్యాధికారి గోపాల్, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గోస్పాడు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

చాగలమర్రి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయమని రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం మండల కార్యవర్గ ఎన్నికను నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మౌలాలి, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.దాదాపీర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శులుగా భాస్కర్‌రెడ్డి, జైలాబ్దిన్ తదితరులను ఎన్నుకున్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల తగ్గింపు



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న నీరు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి అధికారులు నీటి సరఫరాను గురువారం భారీగా తగ్గించారు. దిగువన ఉన్న రిజర్వాయర్లు గరిష్ట స్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కేవలం 2వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే ఎస్సార్బీసీ కాల్వలోకి సరఫరా చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేస్తున్న నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ వద్ద నుంచి గాలేరు నగరి సుజలస్రవంతి(జీఎన్ఎస్ఎస్)కాల్వకు, కేసీ ఎస్కేప్ కాల్వకు వెయ్యి చొప్పున నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

ఓంకారేశ్వరుని సన్నిధిలో కలెక్టర్



ఓంకారేశ్వరుడికి పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకారక్షేత్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాజకుమారి దర్శించుకున్నారు. ఆలయ ఈఓ నాగప్రసాద్, అర్చకులు కలెక్టర్‌కు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ధోనీఆల్‌ఫ్రెడ్, వీఆర్‌ఓ కలాం, పూజారి మల్లికార్జున ఉన్నారు.

రహదారి ఏర్పాటులో అడ్డంకులు తొలగించాలి



సమస్యను సభ దృష్టికి తెస్తున్న ఎంపీటీసీ సుదర్శన్ రెడ్డి

నంద్యాల(అర్బన్): ప్రజాప్రయోజనాల కోసం ఏర్పాటు చేస్తున్న రహదారి ఏర్పాటులో వస్తున్న అడ్డంకులను అధికారులు తొలగించాలని నంద్యాల మండలం పుసులూరు గ్రామ ఎంపీటీసీ సుదర్శన్ రెడ్డి కోరారు. సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా వేస్తున్న డ్రైనేజీ కాల్వను స్థానికులు కొందరు అడ్డుకుంటున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో గురువారం ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇటీవల మంజూరైన నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఎంపీపీ ప్రభాకర్ అధికారులకు సూచించారు. గ్రామంలో రహదారుల పక్కన కంపచెట్లు మొలిచి ఇబ్బందులు పెడుతున్నాయని తొలగించాలని పెద్ద కొట్టాల గ్రామ సర్పంచ్ వెంకటరాముడు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



1930 నంబర్ ఆకారంలో గొడుగులతో విద్యార్థులు

బొమ్మలసత్రం: సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో ప్రజలు అవగాహన పెంచుకోవటం అవసరమని సీఐలు ఇస్మాయిల్, మారుతిరావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలో 137 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొత్త ఫోన్ నంబర్ల నుంచి వచ్చే యాప్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. కొత్త వారు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుపతిరావు, మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు, డాక్టర్ శారదాబాయి పాల్గొన్నారు.

విరగ్గాసిన వరి



క్రిష్టిపాడు వద్ద కుందూ నది ఒడ్డున గుత్తులుగా కాసిన వరి ధాన్యం

దొర్నిపాడు: వరి పంటను నీటి ఆధారిత పంటల్లో మాత్ర పంటగా భావిస్తారు రైతులు. అధిక వర్షాలు కురిసినప్పటికీ తట్టుకొని వరిలో ఆశించిన దిగుబడులనే సాధించారు. మండలంలో గుత్తులు గుత్తులుగా విరగ్గాసిన వరి పంటను చూసి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. బస్తా ధర రూ.1,500 మించి లేకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతేడాది వరి ఎకరాకు 40 బస్తాలు దిగుబడులు రావడమే గాక బస్తా రూ.2,400 ప్రకారం ధర లభించింది. దీంతో అన్నదాతలు లాభాలు మూట గట్టుకున్నారు. ప్రస్తుతం దిగుబడి ఆశించిన మేర ఉన్నా.. ధర ఆందోళన కలిగిస్తోంది. ఈ ధరకు పంట విక్రయిస్తే పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ దానమ్మ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు సెల్‌ఫోన్ వదిలి చదువుపై దృష్టి పెట్టాలని, కష్టపడితేనే భవిష్యత్ బాగుంటుందని సీఐ రమేష్‌కుమార్, ఎస్ఐ దానమ్మ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కేఎస్ఎం పురపాలక ఉన్నత పాఠశాలలో నంద్యాల మహిళా పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో డయల్ 112, 1930 నంబర్లపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సత్ప్రవర్తన, క్రమశిక్షణ, విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై 1930కు ఫోన్ చేయాలన్నారు. ఆకతాయిలు వెంబడిస్తే 112కు వెంటనే ఫోన్ చేయాలని సూచించారు. ఆ వెంటనే బ్లూ కాప్స్ టీం మిమ్మల్ని రక్షిస్తుందని చెప్పారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు షపక్తుల్లా, శివకుమార్, రామసుబ్బారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మద్దయ్య, మహిళా పోలీసులు లక్ష్మీ పాల్గొన్నారు.

కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట మజరా గ్రామమైన డి.కొత్తపల్లె గ్రామంలో ఊర వంక స్థలాన్ని టీడీపీ నాయకుడు కబ్జా చేశారని, రైతులు ఫిర్యాదు చేస్తే మైనర్ ఇరిగేషన్ ఏఈ, తహసీల్దారు, పోలీసుల సమక్షంలో మండల సర్వేయర్ కొలతలు నిర్వహించి కబ్జాకు గురైన వంక పోరంబోకు భూమిని గుర్తించినా స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదని, కబ్జా చేసిన వ్యక్తికి వత్తాసు పలుకుతున్నారని తహసీల్దారు రవి కుమార్‌ను సర్పంచ్ బాలీశ్వరరెడ్డి నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టా భూముల్లో కాలువ తవ్వుతామని, కాలువ తవ్వడానికి నిధులు లేవని తహసీల్దార్ చెప్పడం సమంజసమేనా అంటూ ప్రశ్నించారు. తహసీల్దారు సమాధానం ఇస్తూ రాజకీయ జోక్యం లేకుంటే సమస్య పరిష్కరిస్తామన్నారు.పెద్దబోధనం ఎంపీటీసీ నరసింహుడు మాట్లాడుతూ పొలాల రస్తాను కొందరు రైతులు మూసి వేస్తున్నారని సభ దృష్టికి తీసుకురాగా.. తహసీల్దార్ స్పందిస్తూ.. ప్రతి పొలానికి రస్తాను ఏర్పాటు చేయటానికి జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేశారని, సమస్యను మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం వ్యవసాయ, ఉద్యానవన, ఎన్ఆర్ఇజీఎస్, పంచాయితీరాజ్, పశువైద్య, వైద్యారోగ్య, అటవీ, ఐసీడీఎస్, విద్యుత్తు శాఖల అధికారులతో ఎంపీపీ వీరభద్రుడు సమీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ లక్ష్మీదేవి, వైస్ఎంపీపీలు ముల్లా రఫీ, ఆశీర్వాదమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణను రద్దు చేయండి



మాట్లాడుతున్న శివయ్య

నంద్యాల(న్యూటౌన్):ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని రద్దు చేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో తాలూకా కేంద్రాల్లో నిర్వహించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మొదటి విడతలో జరిగిన శిక్షణలో ఉపాధ్యాయులు అనారోగ్యంతో మృతి చెందారన్నారు. దూర ప్రాంతంలో శిక్షణ నిర్వహించకుండా తాలూకా కేంద్రాల్లో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తిమ్మారెడ్డి, దస్తగిరిబాషా, రాజ్‌కుమార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.